క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ మేరీ ప్రశాంతి



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దాసరి మేరీ ప్రశాంతి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. మేరీ ప్రశాంతికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

యువత స్ఫూర్తివంతమైన పాత్ర పోషించాలి



ముక్కువాను సన్మానిస్తున్న కళాశాల, ఏబీవీపీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశాభివృద్ధిలో యువత స్ఫూర్తివంతమైన పాత్ర పోషించాలని, ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతంగా నిలుస్తూ విజయం దిశగా అడుగులు వేయాలని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ఎండీ కె.సాయి రోహిత్ పేర్కొన్నారు. సేవ్ నేషన్ - సేవ్ యూత్ పేరిట దేశ వ్యాప్తంగా ఆరు వేల కిలోమీటర్ల రూపేష్ ముక్కువా పరుగు యాత్ర బుధవారం ఏలూరు నగరానికి చేరుకుంది. ముక్కువాకు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ముక్కువాను సన్మానించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఖేల్ కన్వీనర్ పూజారి రాఘవేంద్ర, జిల్లా కన్వీనర్ ఎన్ నాగబాబు, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగాశ్వని అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: గాలాయగూడెంలోని నాగాశ్వని పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలను బుధవారం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు ప్రారంభించారు. తొలుత అమ్మవారికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకాలంకరణ చేశారు. గాలాయగూడెం పూజారి వారి ఆడపడుచు నాగాశ్వని అమ్మవారి ఉత్సవాలు వైభవంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తామని చైర్మన్ పూజారి అన్నవరం, దుర్గా దంపతులు అన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తుల సమక్షంలో అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు, ఏనుగు శివరామకృష్ణ, సొంగా రాము, అందే మహంకాళి, పెద్దిశెట్టి నాని, పూజారి రామచంద్రరావు ఠాగూర్, అచ్చిబాబు ఉన్నారు.

ఉపాధి పనుల ప్రారంభం

దెందులూరు: గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అన్నారు. బుధవారం గాలాయగూడెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో ప్రజాప్రతినిధులు భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ సొంగా ప్రమీల, సొసైటీ అధ్యక్షులు తోట అచ్చియ్య, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, నాయకులు బసవయ్య, తోట వెంకన్న పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



పెదవేగిలో మట్టి నమూనా సేకరిస్తున్న దృశ్యం

పెదవేగి : భూసార పరీక్షలతో భూమికి రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారిణి ఎం ప్రియాంక చెప్పారు. పెదవేగి రైతు భరోసా కేంద్రంలో ఏఓ ప్రియాంక అధ్యక్షతన మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్ర ఇన్‌చార్జ్‌లకు భూసార పరీక్షల నిర్వహణపై మండల స్థాయి వర్క్‌షాప్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారిణి ప్రియాంక మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకుని, ఆ నివేదిక ద్వారా సిఫార్సు చేసిన ఎరువులను రైతులు సరైన సమయంలో సరైన మోతాదులో పంటకు అందించవచ్చని తెలియజేశారు. అనంతరం రైతు పొలంలో మట్టి నమూనా ఎలా సేకరించాలో ప్రయోగాత్మకంగా చూపించారు.

భూసారం ఆధారంగా దిగుబడి

ఉంగుటూరు: భూసారం ఆధారంగా పంటల దిగుబడి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ అన్నారు. బుధవారం ఉంగుటూరులో గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అగ్రవర్ణ పేదలకు జగనన్న ఆర్థిక చేయూత



ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు (ఫైల్)

- ఈబీసీ నేస్తం రెండో విడత నగదు జమ
- ఏలూరులో రెండు విడతల్లో రూ.3 కోట్ల లబ్ధి

ఏలూరు (టూటౌన్): అగ్రవర్ణ పేదమహిళలు తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక చేయూత ఇస్తున్నారంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కాపు నేస్తం, చేయూత పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు మహిళలకు నవరత్నాల పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వచ్చింది. అలాగే అగ్రవర్ణ పేదలకు ఈబీసీ నేస్తం పేరుతో ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడేళ్ల పాటు రూ.45 వేలు ఆర్థిక సాయం అందించనుంది. తొలివిడత 2021–22 ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదల చేయగా, తాజాగా ఈబీసీ నేస్తం పథకానికి సంబంధించి రెండో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం బటన్ నొక్కి విడుదల చేశారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఈ బీసీ నేస్తం పథకంలో తొలివిడత 941 మందికి రూ.1.41 కోట్లు లబ్ధి చేకూరింది. రెండో విడతలో లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. నియోజకవర్గంలో 1,046 మందికి రూ.1.57 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది.

రెండు విడతల్లో లబ్ధి పొందిన వివరాలు

	లబ్ధిదారులు	లబ్ధి పొందిన మొత్తం
మొదటి విడత	941	రూ.1.41 కోట్లు
రెండో విడత	1046	రూ.1.57 కోట్లు

సంతోషంగా ఉంది



రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎవరు వచ్చినా ఎస్సీ, బీసీ, మైనార్టీలకే పథకాలను ప్రవేశపెట్టేవారు. దానికి భిన్నంగా సీఎం వైఎస్ జగన్ అగ్రవర్ణ పేదలకు ఆర్థిక భరోసా కల్పించడం హర్షణీయం. మాలాంటి నిరుపేదలకు ఈబీసీ నేస్తం ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– నాగ సూర్యకుమారి, లబ్ధిదారురాలు, నవాబ్‌పేట, ఏలూరు

ఆర్థిక సాయం గొప్ప విషయం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజిక వర్గాలకే కాకుండా అగ్రవర్ణ పేదలకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడు విడతల్లో రూ.45 వేలు ఆర్థిక సాయం చేయనుండడం గొప్ప విషయం. ఇంతటి సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఉప్పలపాటి లక్ష్మి, లబ్ధిదారురాలు, ఎన్ఆర్‌పేట, ఏలూరు

నవరత్నాల్లో లేకపోయినా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నవరత్నాల పథకాల్లో ఈబీసీ నేస్తం పథకం చేర్చకపోయినప్పటికీ అగ్రవర్ణ పేదలకు మేలు చేసే విధంగా ఈ పథకాన్ని అమలు చేయడం చాలా గొప్ప విషయం. అగ్రవర్ణ పేద మహిళల పక్షాన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

– డి.విజయ, లబ్ధిదారురాలు, అమీనాపేట,ఏలూరు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నాం. అర్హత గల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది. ఈ బీసీ నేస్తం పథకం అగ్ర వర్ణ పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. ఈ పథకాన్ని అర్హులైన అగ్రవర్ణ పేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎన్ పుష్పలత, ఈడీ, బీసీ కార్పొరేషన్, ఏలూరు

ఒకే కుటుంబంలో ముగ్గురు కవులకు సన్మానం



నగరానికి చెందిన కవి శ్రీహరి కోటిని సన్మానిస్తున్న సాహితీ బ్రహ్మోత్సవాల నిర్వాహకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం నిర్వహించిన తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తమ కవితాగానంతో ప్రేక్షకులను విశేషంగా అలరించిన జిల్లాకు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు కవులను ఘనంగా సన్మానించారు. తిరుపతి పుణ్యక్షేత్రములోని మహతి ఆడిటోరియంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్విరామంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కవితా గానం చేసినందుకు నగరానికి చెందిన శ్రీహరికోటి, ఆయన సతీమణి శ్యామల హరికోటి, కుమార్తె శైలా భవాని హరికోటిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా శ్రీహరికోటి రచించిన ×నాన్న మిన్న శతక పద్యాల పుస్తకావిష్కరణ చేశారు.

జగన్‌కు జై కొడుతున్న జనం



తంగెళ్లమూడిలో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ స్వాతి శ్రీదేవి, పార్టీ నాయకులు కిషోర్



ఏలూరులో లబ్ధిదారులతో కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి

ఏలూరు టౌన్: ప్రజాసంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టి పక్కాగా అమలు చేస్తున్న నేపథ్యంలో తాజాగా రాష్ట్ర సర్కారు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో నగరంలోని ఆయా ప్రాంతాల్లో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 15వ డివిజన్‌లో ఓ లబ్ధిదారుని ఇంటికి కార్పొరేటర్ తంగెళ్ల రాము, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు వెళ్లగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికించాలని కోరారు. దీంతో లబ్ధిదారుని ఇంటి పూజగదిలో జగనన్న స్టిక్కర్‌ను అతికించారు. ఇది సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న ఆప్యాయత, విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. 48వ డివిజన్ తంగెళ్లమూడి ప్రాంతంలో కార్పొరేటర్ సున్నా స్వాతి శ్రీదేవి, పార్టీ నాయకులు సున్నా కిషోర్‌తో పాటు గృహసారథులు ఇంటింటికీ వెళ్లి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ అయేషా సుల్తానా, ముస్లిం మైనార్టీ నాయకులు రియాజ్ అలీఖాన్ ఆధ్వర్యంలో పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

జాలిపూడి, కాట్లంపూడి గ్రామాల్లో..

ఏలూరు రూరల్: ఏలూరు మండలం జాలిపూడి, కాట్లంపూడి గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం బుధవారం ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ఎంపీపీ కాకర్ల తంబి, పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, బాపనయ్య, జాలిపూడి రైతు సంఘం చైర్మన్ బొల్లిముంత రామ్మోహనరావు, గృహసారథుల మండల కన్వీనర్ గుర్రం శివతో పాటు కోడిచుక్కల శేషు, మధ్యాహ్నపు వాసు తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల పనితీరుపై ఆరా తీశారు.



15వ డివిజన్‌లో లబ్ధిదారుడు పూజగదిలో జగనన్న స్టిక్కర్‌ను అతికించిన నాయకులు



జాలిపూడిలో కరపత్రాలు అందిస్తున్న నాయకులు



కాట్లంపూడిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- పిల్లల బంగారు భవిష్యత్తే లక్ష్యం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని



30వ డివిజన్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 88వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 30వ డివిజన్ వినాయకుని గుడి ప్రాంతం నుంచి పాదయాత్రగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు వైఎస్‌వీ శివరావు తదితరుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి సాదరస్వాగతం పలికారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తోన్న పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో మహిళలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను మహిళలు ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక లోపంతో పథకాలకు దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే నాని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం సామాజిక, ఆర్థికంగా బలోపేతం కావాలంటే విద్యతోనే సాధ్యమనే ఉద్దేశంతో జగనన్న విద్యారంగంపై వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని తెలిపారు. పిల్లలు విద్యకు దూరం కాకుండా బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నారని నాని వివరించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికే పాఠ్యపుస్తకాలు, బెల్టులు, షూలు, బ్యాగ్, యూనిఫామ్ అందిస్తూ విద్యను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.



ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పూర్వ టీడీపీ నాయకులు సాంబశివరావు

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఏలూరు పత్తేబాద మంచినీళ్ల తోటకు చెందిన బి.సాంబశివరావు ఎమ్మెల్యే నాని సమక్షంలో పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీలో క్రియాశీలకపాత్ర పోషించి జిల్లా అధ్యక్షుడిగా 1999లో పనిచేయడంతో పాటు జూట్‌మిల్లు వైస్ ప్రెసిడెంట్‌గా కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేసిన సాంబశివరావు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి తాను కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్న బలరాం, బందారు కిరణ్ కుమార్, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, మాజీ కార్పొరేటర్ వానపల్లి లక్ష్మి, పార్టీ నాయకులు రేఖపల్లి నారాయణ, ఇంజనీర్ గోపాల్, పూర్ణ, సైకిల్‌షాపు పండు, సత్తార్, బి.రవి కుమార్, పి.బాలు, జిజ్జువరపు రమేష్, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతీ, పీఓ కృష్ణమూర్తి, భూషణం, టూటౌన్ ఎస్సై ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ఘనంగా ఐసీఎం సంఘాల 122వ కన్వెన్షన్



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న అగ్రపీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పెద్ద రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆల్ సెయింట్స్ ఇండియా క్రిస్టియన్ మిషన్ (ఐసీఎం) చర్చి కథీడ్రల్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో ఐసీఎం సంఘాల 122వ జనరల్ కన్వెన్షన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొని మాట్లాడారు. ఇతర దేశాల్లో సైతం ఇండియా పేరుతోనే ఐసీఎం సంఘం విస్తరించడం అద్భుతమన్నారు. సంఘ అగ్రపీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు నాయకత్వంలో సంఘం మరింత బలపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ దయాల నవీన్ బాబు మాట్లాడుతూ ఐసీఎం సంఘ కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా క్రైస్తవ వేదాంతి మృత్యుంజయ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఐసీఎం సంఘానికి చెందిన వివిధ రాష్ట్రాల బిషప్‌లు ఆగస్టిన్ సుకుమార్ పశ్చిమ బెంగాల్, కొండూరి డానియేల్ తెలంగాణ, శాంసన్ పంజాబ్, రత్న జాయ్ రియాంగ్ త్రిపుర, డెస్మండ్ ఉత్తరాఖండ్, నక్కా రోజీ జాన్, జాన్ లియో తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో నగరంలో దైవ సేవ చేస్తున్న ఏలూరు పాస్టర్ల అసోసియేషన్ కౌన్సిల్, ఫెడరేషన్ల అధ్యక్షులు జీపీ ఆశీర్వాదం, ఎబినేజర్ శాస్త్రి, జీవన్ కుమార్, పీపీ రాజులను ఘనంగా సత్కరించారు.

భానుడు భగభగ





ఏలూరు నగరంలో ఎండ తీవ్రతకు ప్రజల ఇక్కట్లు

భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 8 గంటలు దాటగానే సూర్యప్రతాపం మొదలవుతుంది. మధ్యాహ్నం అయ్యేసరికి ఎండతీవ్రతకు రోడ్లన్నీ ప్రయాణికుల్లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు గొడుగు, చున్నీలు కప్పుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ మాసంలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు హడలెత్తిపోతున్నారు. బుధవారం ఏలూరు నగరంలో 42 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

– సాక్షిఫొటో గ్రాఫర్/ఏలూరు



మాకినేనికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): సీపీఎం అగ్రనాయకుడు, మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాంతం పీడిత ప్రజల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడిన కమ్యూనిస్టు యోధుడు మాకినేని బసవ పున్నయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం స్థానిక జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వి.సాయిబాబా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.కిషోర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను వివరించారు. పార్టీ నాయకులు పి.ఆదిశేషు, కె.విశ్వనాథం, జె.గోపి, కె.లెనిన్, జి.కోటేశ్వరరావు, ఎం.ఇస్సాకు, ఎం.సత్యం, సీహెచ్ పైడియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో తగినంత బడ్జెట్ కేటాయించి, జీతాలు సకాలంలో చెల్లించే విధంగా ఆర్థిక శాఖకు ఆదేశాలు జారిచేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దెందులూరు: దెందులూరుకు చెందిన కొడాలి కృష్ణకుమారికి బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సీఎంఆర్‌ఎఫ్ రూ.65 వేల చెక్కును అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, నాయకులు పాల్గొన్నారు.